ఉపాధితోనే మహిళల ఆర్థిక ప్రగతి సాధ్యం

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


స్వయం సహాయక మహిళల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్: స్వయం సహాయక సంఘాల మహిళలు ఉపాధి మార్గాలు ఎంచుకుని ఆర్థిక ప్రగతి సాధించాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం సీతాఫల్‌మండిలోని ఎస్‌పీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో సికింద్రాబాద్ నియోజకవర్గ స్వయం సహాయక సంఘాల మహిళాప్రతినిధుల సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిపట్టున ఉంటున్న మహిళలందరినీ స్వయం సహాయక బృందాల్లో చేర్పించి ఉపాధి అవకాశాలు చూపించేందుకు మహిళా సంఘాల ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మహిళలు ఆర్థిక ప్రగతి సాధించడం ద్వారా సామాజిక ప్రగతి సాధించవచ్చని కిషన్‌రెడ్డి చెప్పారు. మహిళల సంక్షేమం, ప్రగతి కోసం ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం స్వయం సహాయక సంఘాల మహిళలకు కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన పుస్తకాలను కిషన్‌రెడ్డి అందించారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ రాజశేఖరరెడ్డి, మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, నియోకవర్గ పార్టీ ఇన్‌చార్జీలు కాంతారావు, జయశ్రీ, కార్పొరేటర్లు రచనశ్రీ, సుప్రియ, దీపిక, బీజేపీ నాయకులు రాచమల్ల కృష్ణమూర్తి, కందాడి నాగేశ్వర్‌రెడ్డి, అంబాల రాజేశ్వర్‌రావు, శారదామల్లేశ్, కీర్తి హర్షకిరణ్ తదితరులు పాల్గొన్నారు.


ఓటర్ నమోదు, సవరణలకు స్పెషల్ డ్రైవ్


తుకారాంగేట్ ఎంసీహెచ్ క్వార్టర్స్ వద్ద ఓటర్ నమోదుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న దృశ్యం

అడ్డగుట్ట: పద్దెనిమిది సంవత్సరాలు నిండిన వారందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ కేకేసీ సికింద్రాబాద్ జిల్లా చైర్మన్ గంట రాజుసాగర్ సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా అడ్డగుట్ట డివిజన్‌లోని పలు పోలింగ్ బూత్‌ల వద్ద శనివారం ఓటర్ నమోదు, సవరణల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తుకారాంగేట్ ఎంసీహెచ్ క్వార్టర్స్ వద్ద ఏర్పాటు చేసిన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకుడు గంట రాజు సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ ఇప్పటికే 18 సంవత్సరాలు నిండిన వారు, 2025వ సంవత్సరం, జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండబోయే వారు ఓటర్‌గా నమోదు చేసుకోవడానికి అర్హులని చెప్పారు. ఇంటి చిరునామా మార్పు, ఇతర సవరణలకై కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్ ఆదివారం కూడా అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద అందుబాటులో ఉంటుందన్నారు. అర్హులైన వారందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బూత్ లెవెల్ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలకు అట్రసిటీ చట్టం అవసరం

బీసీ కమిషన్ చైర్మన్‌కు బీసీ సంక్షేమ సంఘం వినతి


వినతిపత్రం అందజేస్తున్న లింగంగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీలకు కూడా అట్రసిటీ చట్టం అవసమరమని రాష్ట్ర బీసీ సంక్షేమ కార్యదర్శి జాజుల లింగంగౌడ్, ఎంబీసీ అధ్యక్షుడు బడేసాబ్ అన్నారు. శనివారం రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతిపత్రం అందచేసినట్లు తెలిపారు. ఇప్పుడిప్పుడే చైతన్యం అవుతున్న బీసీ కులాలను చూసి కొన్ని వర్గాలు ఓర్వలేక దాడులు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలలో కొన్ని కులాల వారిని కించపరిచేలా మాట్లాడుతున్నారని, వారి రక్షణకు ఏపీ తరహాలో బీసీ చట్టం తీసుకరావాలసిన అవసరం ఉందన్నారు. కుల వృత్తులు చేయనివారిని గ్రామ అభివృద్ధి కమిటీల పేరుతో గ్రామ బహిష్కరణ చేస్తున్నారని ధ్వజమెత్తారు. కొన్ని గ్రామాల్లో రజకులను బట్టలు ఉతకాలని, లేని పక్షంలో ఊరు విడిచి వెళ్లాలని గ్రామా అభివృద్ధి కమిటీలు హుకుం జారీ చేసిన సంఘటనలు ఉన్నాయన్నారు. ఓ గ్రామంలో నాయిబ్రాహ్మణ(మంగళి) యువకుడు అగ్రవర్ణాలకు చెందిన అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకుంటే వారి ఇంటిని స్వాధీనం చేసుకొని ఊరు నుంచి తరిమివేశారని విచారం వ్యక్తం చేశారు. గ్రామాలలో కుమ్మరి, కమ్మరి, పద్మశాలి, వడ్డెర, చాకలి, మంగలి, పిచ్చకుంట్ల తదితర బీసీ కటుంబాలను చిన్నచూపు చూస్తున్నారని వివరించారు. ఇలా బీసీలపై వెలుగులోకి రాని అవమానాలు జరిగిన సంఘటనలు ఉన్నాయని లింగంగౌడ్ వివరించారు. ప్రస్తుతం జరుగుతున్న జనగణన ముగియక ముందే బీసీల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

ఓటరు దరఖాస్తు ఫారాల అందజేత



బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జీహెచ్‌ఎంసీ అధికారులు శనివారం నూతన ఓటర్ల నమోదు, సవరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బూత్ స్థాయిలో ఏర్పాటు చేసిన శిబిరాల్లో నూతన ఓటర్ల నమోదుతోపాటు సవరణ కోసం దరఖాస్తు ఫారాలను అందజేశారు. గొల్లకొమురయ్య కాలనీ, బోయిగూడ, బన్సీలాల్‌పేట్, రాణిగంజ్, మోండా మార్కెట్, బోలక్‌పూర్ తదితర ప్రాంతాల్లో శిబిరాలను ఏర్పాటు చేశారు. స్థానికులు బూత్ స్థాయిలో ఏర్పాటు చేసిన శిబిరాలను సందర్శించి ఓటర్ సవరణ, నమోదుల కోసం దరఖాస్తు చేసుకోవడం కనిపించింది. ఈ నెల 10 తేదీ ఆదివారం కూడా ఈ శిబిరాలు పనిచేస్తాయని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య చెప్పారు. జనవరి 2025 వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్‌గా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గొల్ల కొమురయ్య కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో పలువురు దరఖాస్తులు తీసుకున్నారు. స్థానిక నాయకులు ఎల్. వెంకటేషన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు పరిరక్షించండి

ఆర్డీవోకు కార్పొరేటర్ హేమ వినతి


ఆర్డీవో సాయిరాంతో మాట్లాడుతున్న హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని ప్రభుత్వ స్థలాలను పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ కోరారు. ఈ మేరకు సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాంను కలిసి వినతిపత్రం అందించారు. హేమ మాట్లాడుతూ వారసిగూడా లక్కీ హోటల్ వెనుక వైపు ఉన్న ఖాళీ స్థలం, మార్కండేయ నగర్ బ్లాక్ పార్క్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాల్లో పాగా వేసేందుకు కొంతమంది ప్రైవేటు వ్యక్తులు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే కొంతమేర స్థలం ఆక్రమణకు గురైందని చెప్పారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కోరారు. ఇందుకు స్పందించిన ఆర్డీవో ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిని ఉపేక్షించబోమని, చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్టు ఆమె చెప్పారు. సుభాష్ చంద్రబోస్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ గృహాలు ఇంకొంత మంది లబ్ధిదారులకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్టు సామల హేమ చెప్పారు.

వాటర్‌ప్లాంట్‌కు రూ.20 వేల జరిమానా


వాటర్ ప్లాంట్‌కు జరిమానా విధిస్తున్న అధికారులు

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని లాలాపేట ఇందిరానగర్‌లో ట్రేడ్ లైసెన్స్ లేకుండా కొనసాగుతున్న ఓ వాటర్ ప్లాంట్‌కు శనివారం జీహెచ్‌ఎంసీ అధికారులు రూ.20 వేలు జరిమానా విధించారు. ఎస్‌ఎస్ మోడల్ స్కూల్ పక్కన కొనసాగుతున్న ఈ వాటర్‌ప్లాంట్ వద్ద సరైన శుచిశుభ్రత పాటించడం లేదు. ఆ పక్కనే పశువుల కొట్టం సైతం నిర్వహిస్తున్నారు. దీంతో ఈ ప్లాంట్ ద్వారా నీటిని తాగుతున్న కొందరు అనారోగ్యం బారిన పడిన సంఘటనలు ఉన్నాయి. ఈ విషయమై ఇటీవలే పలువురు స్థానికులు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు వాటర్ ప్లాంట్‌ను తనిఖీ చేశారు. పరిసరాల పరిశుభ్రత పాటించకపోవడమేకాకుండా ట్రేడ్ లైసెన్స్, ప్రాపర్టీ టాక్స్ వంటివి పెండింగ్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటన్నింటిని రెండు, మూడు రోజుల్లో క్లియర్ చేసుకోవాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు. లేనిచో వాటర్‌ప్లాంట్‌ను మూసి వేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఆధ్యాత్మికతతోనే సుఖసంతోషాలు

పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకరభారతీస్వామి


శ్రీమహారుద్రయాగంలో పాల్గొన్న పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకరభారతిస్వామి


అనుగ్రహభాషణం చేస్తున్న పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకరభారతిస్వామి

చిలకలగూడ: సమస్త మానవాళి సుఖసంతోషాలకు మూలమైన ఆధ్యాత్మిక భక్తిభావాన్ని మరింత పెంపొందించి సనాతన ధర్మాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకరభారతీస్వామి ఉద్బోధించారు. సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం తిరుపాద మండపంలో రెండురోజులుగా నిర్వహిస్తున్న శ్రీమహారుద్ర యాగంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని భక్తులను అనుగ్రహభాషణం చేశారు. శివకేశవులకు పవిత్ర కార్తీకమాసం ఎంతో ప్రీతిపాత్రమైనదని, భక్తిశ్రద్ధలు, నియమ నిబంధనలతో మహారుద్రయాగం నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు, వేదపండితులను అభినందించారు. వేదసంరక్షణ సనాతన ధర్మానికి పట్టుకొమ్మని, నిరంతర వేద పారాయణం, పఠనం, అధ్యయనం చేయాలని పిలుపునిచ్చారు. వేదపండితుడు రాధాకృష్ణశర్మ బ్రహ్మత్వంలో 25 మంది రుత్విక్కుల నేతృత్వంలో మహన్యాసం, ఏకాదశ రుద్ర పారాయణం, అభిషేకం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించామని, చివరిరోజైన ఆదివారం శ్రీమహారుద్రయాగం కొనసాగుతుందని, భక్తులు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆలయ ట్రస్ట్ బోర్డు అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాలరావు, లక్ష్మీనారాయణ, ఈఓ రాజేష్‌కుమార్ కోరారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు బాలభాస్కర్, లక్ష్మీనారాయణ, ఆత్మరామసూర్యసుబ్రహ్మణ్యం, శివశంకరన్, నారాయణన్, సుజయ్‌ప్రకాశ్, షన్ముకరెడ్డిలతోపాటు భక్తులు, ఆధ్యాత్మికవేత్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సీసీ రోడ్ పనుల పరిశీలన

సికింద్రాబాద్: మధురానగర్ ఎస్ఆర్ ఆసుపత్రి వెనుక గల్లీలో జరుగుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణపనులను శనివారం సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ పర్యవేక్షించారు. రోడ్డు నిర్మాణపనులను రూ.30 లక్షల వ్యయంతో చేపట్టినట్టు చెప్పారు. నాణ్యతాప్రమాణాలు పాటించాలని, నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి స్థానికులకు అందుబాటులోకి తేవాలని అధికారులను కోరారు. అనంతరం ఆమె స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అధికారులతో మాటాడి పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్, జలమండలి సెక్షన్ మేనేజర్ నవ్య తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల సత్తా



సికింద్రాబాద్: నగరంలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో నిర్వహించిన 19వ ఓపెన్ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో సీతాఫల్‌మండికి చెందిన పలువురు విద్యార్థులు పతకాలను చేజిక్కించుకున్నారు. సీతాఫల్‌మండి ఆర్సీ కరాటే బుడోకాన్ అకాడమీకి చెందిన విద్యార్థులు మూడు బంగారు, ఏడు రజిత, ఆరు కాంస్య, మూడు గ్రాండ్ చాంపియన్‌షిప్ పతకాలను గెలుచుకున్నారు. గ్రాండ్ చాంపియన్ షిప్ ట్రోఫీలను అజ్వాన్, సాత్విక్, అక్షిత దక్కించుకున్నారు. బంగారు పతకాలను మహీధర్, భరత్, సాత్విక్, అజ్లాన్, అక్షిత, శశాంక్, లిఖిత చేజిక్కించుకున్నట్టు అకాడమీ నిర్వాహకులు తెలిపారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

సికింద్రాబాద్: సికింద్రాబాద్ మహంకాళి జిల్లా పరిధిలో రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రయం చేపట్టేందుకు సమాయత్తం కావాలని జిల్లా సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ కోరారు. శనివారం నామాలగుండులో జరిగిన సికింద్రాబాద్, సనత్‌నగర్, ముషీరాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాల బీజేపీ నాయకుల వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశ ప్రగతి కోసం చేస్తున్న కృషిని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రచారం చేయడం ద్వారా పార్టీ సభ్యత్వ నమోదును రెట్టింపు చేయాలన్నారు. బీజేపీ నాయకులు కాంతారావు, రాజశేఖరరెడ్డి, మేకల సారంగపాణి, కృష్ణమూర్తి, కందాడి నాగేశ్వరరెడ్డి, కనకట్ల హరి, కార్పొరేటర్లు దీపిక, సుప్రియ, రచనశ్రీ పాల్గొన్నారు.

డివైడర్ పైకి ఎక్కిన కారు

సనత్‌నగర్: అదుపుతప్పిన కారు డివైడర్ పైకి దూసుకెళ్లిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... శనివారం రాత్రి 7.30 గంటల సమయంలో ఎర్రగడ్డ చౌరస్తా నుంచి ఫతేనగర్ వైపు వెళ్తుండగా ఎఫ్‌సీఐ గిడ్డంగుల ముందు కారు ప్రమాదవశాత్తూ అదుపుతప్పి డివైడర్‌పైకి ఎక్కింది. కారు నడుపుతున్న సమ్మద్ వెంటనే అప్రమత్తమై సురక్షితంగా కిందకు దూకేశాడు. కారు స్వల్పంగా ధ్వంసమైంది. సమాచారం అందుకున్న బాలానగర్ ట్రాఫిక్ పోలీసులు క్రేన్ సహాయంతో అక్కడి నుంచి తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



పద్మారావునగర్: గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహాన్ని గాంధీనగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఓ హోటల్ ముందు ఓ యువకుడు మరణించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు 20 నుంచి 25 సంవత్సరాలు ఉంటుందని, బ్లాక్ కలర్ టీషర్ట్ ధరించి ఉన్నాడని చెప్పారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలియజేశారు. అతడి సంబంధీకులు ఎవరైనా ఉంటే వెంటనే గాంధీనగర్ పోలీసు స్టేషన్‌లోగాని లేదా 87126 61248, 87125 71072 నెంబర్లలో గానీ సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

చిరువ్యాపారుల పొట్ట కొట్టొద్దు

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్


అధికారులతో కలిసి అమీర్‌పేటలో పర్యటించిన తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట: సుందరీకరణ, అభివృద్ధి పేరుతో చిరువ్యాపారుల పొట్ట కొట్టొద్దని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అధికారులు అభివృద్ధి పనుల పేరు చెప్పి ఇబ్బందులు సృష్టిస్తున్నారని మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి గోడును విన్నవించారు. ఈ నేపథ్యంలో అమీర్‌పేట హనుమాన్, కనకదుర్గ ఆలయ పరిసరాల్లో శనివారం వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. చిరు వ్యాపారులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తలసాని మాట్లాడుతూ చిరు వ్యాపారులెవరూ ఆందోళన చెందవద్దని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గత 70 ఏళ్ల నుండి అమీర్‌పేట, మైత్రివనం, గురుద్వారా హనుమాన్, కనకదుర్గమ్మ ఆలయ పరిసరాల్లో తోపుడుబండ్లు, ఫుట్‌పాత్‌లపై వివిధ రకాల వ్యాపారాలు చేసుకుంటూ వేలాదిమంది జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ అధికార యంత్రాంగం వ్యాపారులను ఇబ్బందులకు గురు చేస్తే వారు ఎక్కడి వెళ్లాలని, వారిపై ఆధారపడ్డ కుటుంబాలు ఏమైపోవాలని ప్రశ్నించారు. వారికి ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ప్రభుత్వ అధికారులు వెంకటనారాయణ, హరిశంకర్, వంశీ, సుధాకర్, శ్రీనివాస్, శ్రావణ్, కాంతారవు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చర్యలు: ట్రాఫిక్ డీసీపీ


ఫుట్‌పాత్ వ్యాపారులను హెచ్చరిస్తున్న డీసీపీ రాహుల్ హెగ్డె

రాంగోపాల్‌పేట్: రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డె హెచ్చరించారు. శనివారం గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఉత్తర మండలం ఏసీపీ శంకర్‌రాజు, ఇన్‌స్పెక్టర్ వెంకటరాములు తదితర అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కొద్దిమంది వ్యాపారులు షాపులతోపాటు ముందుండే ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపార సామగ్రిని ఏర్పాటు చేయడం, మరికొంత మంది ఏకంగా ఫుట్‌పాత్ మొత్తం ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తుండటంపట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆక్రమణలు మొత్తం తొలగించారు. మరో మారు ఇలాగే ఏర్పాటు చేస్తే జీహెచ్‌ఎంసీ అధికారులతో శాశ్వతంగా ఇక్కడి నుంచి తీసివేయిస్తామని చెప్పారు. వ్యాపారులు తమ వైఖరి మార్చుకోకుండా వాహనదారులు, పాదాచారులకు ఇబ్బందులు కలిగిస్తే వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి న్యాయస్థానం ముందుకు తీసుకునివెళతామని హెచ్చరించారు.

సర్వేల నుంచి టీచర్లను మినహాయించాలి


వినతిపత్రం సమర్పిస్తున్న ఎంవీ ఫౌండేషన్, సీఆర్పీఎఫ్ ప్రతినిధులు

అడ్డగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సమగ్ర కుటుంబ సర్వే'లో ఉపాధ్యాయుల సేవలను మినహాయించాలని ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఏవీఎం స్వామి కోరారు. ఈ మేరకు శనివారం తెలగాణ విద్యాశాఖ ప్రధానకార్యదర్శి బుర్ర వెంకటేశంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొనాలని 36,559 ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు, 3,414 ప్రధానోపాధ్యాయులకు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పాఠశాలలను ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకే నిర్వహించాలని చెప్పిందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలపై తల్లిదండ్రులకు ఇప్పటికే తగ్గుతున్న విశ్వాసాన్ని ఈ ఆదేశాలు మరింత దెబ్బతీస్తాయన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సీఆర్పీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్. లక్ష్మీనారాయణ, కృష్ణ పాల్గొన్నారు.

గైనిక్ సమస్యల్ని నిర్లక్ష్యం చేస్తే కేన్సర్‌కు దారితీయొచ్చు

వల్వ్యులర్ హెల్త్ సదస్సులో పలువురు నిపుణులు


కిమ్స్‌లో జరిగిన సదస్సులో పాల్గొన్న డాక్టర్లు

రాంగోపాల్‌పేట్: మహిళల పునరుత్పత్తి అంగాల లోపలి భాగంలో ఉండే చర్మంపై దురద, మంట వంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో కేన్సర్‌కు దారితీసే ప్రమాదం ఉందని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మిషిగన్‌కు చెందిన డాక్టర్ హోప్ కేథరిన్ అన్నారు. సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో వల్వ్యులర్ హెల్త్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు శనివారం ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా 8 రాష్ట్రాలకు చెందిన గైనకాలజిస్టులు, డెర్మటాలజిస్టులు, ఇతర వైద్యులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నార్త్ వెస్టన్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన డాక్టర్ రాజల్ సి పటేల్‌తో కలిసి ఆమె యువ డాక్టర్లకు అవగాహన కల్పించారు. చాలా మంది మహిళలు ఇలాంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తుంటారని, సిగ్గు వల్ల వైద్యులకు చూపించడంలేదని అన్నారు. ఇంతకాలం యోని లోపలి భాగాలకు సంబంధించిన సమస్యలపై దృష్టి పెట్టామని, ఇప్పుడు పై భాగంలో ఉండే చర్మానికి వచ్చే సమస్యలపై కూడా దృష్టి సారించాలన్నారు. ఇవే కాకుండా మహిళల్లో గర్భసంచి కిందకు జారడం, మూత్రవిసర్జన, మల విసర్జనపై నియంత్రణ కోల్పోవడం లాంటి సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయని చెప్పారు. ఈ రంగంలో వస్తున్న సరికొత్త మార్పులు, వైద్య చికిత్సలపై అవగాహన పెంచుకోవాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో కిమ్స్ ఆస్పత్రి యూరో గైనకాలజి విభాగాధిపతి డాక్టర్ అనురాధ కోడూరి, లాప్రోస్కోపిక్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ నీనా దేశాయ్, ఉస్మానియా ఆస్పత్రి గైనకాలజీ విభాగధిపతి డాక్టర్ బాలాంబ తదితరులు పాల్గొని పలు సూచనలు, సలహాలు అందించారు.

17న కుంగ్ ఫూ కరాటే పోటీలు

లాలాపేట: సన్ ఫైటర్స్ కుంగ్ ఫూ అకాడమీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నవంబర్ 17న 11వ నేషనల్ ఓపెన్ టు ఆల్ స్టైయిల్స్ కుంగ్ ఫూ, కరాటే చాంపియన్ షిప్–2024 ను నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ బి.నందప్రసాద్ యాదవ్ తెలిపారు. బోడుప్పల్ చెంగిచెర్లలోని విద్యాజ్యోతి హైస్కూల్ ఆవరణలో వచ్చే ఆదివారం ఉదయం నుంచి ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఎంట్రీల కోసం ఫోన్ 9676900537లో సంప్రదించాలి.

డిసెంబర్ 2న మర్రి చెన్నారెడ్డి వర్ధంతి

గవర్నర్‌ను ఆహ్వానించిన శశిధర్‌రెడ్డి


గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: మాజీ సీఎం, తమిళనాడు మాజీ గవర్నర్ దివంగత డాక్టర్ మర్రి చెన్నారెడ్డి 28వ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి, మాజీమంత్రి మర్రి శశిధర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ 2న మర్రి చెన్నారెడ్డి వర్ధంతి వేడుకలు నిర్వహించనున్న నేపథ్యంలో శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేశారు. దీనికి గవర్నర్ అంగీకారం తెలిపినట్లు శశిధర్‌రెడ్డి తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటా: ఎమ్మెల్యే


బేగంపేట డివిజన్ నేతల సమావేశంలో ఎమ్మెల్యే కృష్ణారావు

సనత్‌నగర్: కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా వారికి అండగా నిలబడతానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు భరోసా ఇచ్చారు. బేగంపేట డివిజన్‌కు చెందిన కార్యకర్తలతో శనివారం ఆయన సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలో బేగంపేట డివిజన్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ముఖ్యంగా బేగంపేట డివిజన్ ప్రజలను ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులకు గురిచేసిన నాలా ముంపు సమస్యను సాధ్యమైనంత వరకు పరిష్కరించినట్లు తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలను పరిష్కరించామన్నారు. ఈ ప్రభుత్వం డివిజన్ అభివృద్ధిపై దృష్టి సారించడం లేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, నాయకులు శ్రీహరి, సురేష్ యాదవ్, నరేష్, రాజయ్య, రఘునాథ్, ప్రవీణ్, మాణిక్యం, సునీత, సాయి, శ్రీను, బాలరాజ్, జహంగీర్, జావీద్, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

ఫజిల్స్‌తో విద్యార్థుల సందడి



సనత్‌నగర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పురస్కరించుకుని సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమ ఆధ్వర్యంలో అమీర్‌పేట జీహెచ్‌ఎంసీ మైదానంలో చిన్నారులకు ఆహ్లాదకరమైన కార్యక్రమాలను నిర్వహించారు. విచిత్రమైన పజిల్స్, ఆటలు, ఉత్సాహభరిత కార్యకలాపాలు నిర్వహించి పిల్లలకు మంచి అనుభూతిని ఇచ్చారు. ముఖ్యంగా పజిల్స్‌లో ప్రముఖ నాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి చిత్రాలను సరైన రీతిలో జత చేసి పిల్లలు తమ ప్రతిభను చాటారు. వినోదం, విద్య, విషయ పరిజ్ఞానం, దేశభక్తి, చిన్నారుల్లో మంచి విలువలను ప్రేరేపించడమే ప్రధాన ఉద్దేశంగా ఈ కార్యక్రమం కొనసాగింది. విభిన్నంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల కాంగ్రెస్ కుటుంబ సభ్యులకు విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

సహకార వారోత్సవాలకు రండి

ఎమ్మెల్సీ కోదండరాంకు ఆహ్వానం

లాలాపేట: రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం నాయకులు శనివారం తార్నాకలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ నెల 19న భీమారం మండలం కాజీపల్లిలో నిర్వహిస్తున్న 71వ అఖిల భారత సహకార వారోత్సవాలకు ముఖ్యఅతిథిగా రావాలంటూ ఆహ్వాన పత్రికను కోదండరాంకు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్, సంఘం నాయకులు ఎం.కె.రాజేష్, వెంకటేష్ తదితరులున్నారు.

ఓయూలో బీఆర్ఎస్వీ విద్యార్థి నేతల అరెస్ట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి నల్లకుంట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 8న మూసీ పాదయాత్ర సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం చేయబోగా పోలీసులు అడ్డుకొని విద్యార్థులను అరెస్ట్ చేశారు. కేసీఆర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డిని విద్యార్థి నేతలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అవినాష్, చందు, చటారి దశరథ్, గంగయ్య, వెంకటేష్, అనిల్, రమేష్‌గౌడ్, ప్రశాంత్, నరేష్, మిథున్, నాగేందర్‌రావు, శ్రీకాంత్, పవన్, సాయి, మనీష తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



అడ్డగుట్ట: పేదలను ఆదుకునేందుకు తమవంతు సహాయం అందిస్తున్నామని, లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320బి గవర్నర్ లయన్ రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం తుకారాంగేట్‌లో లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ పేదలకు తమవంతు సహాయ సహకారాలు అందించేందుకు లయన్స్ ఇంటర్నేషనల్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. అందులో భాగంగా పేద, మధ్య తరగతి ప్రజలకు బియ్యం, ఉప్పు, పప్పు, మంచినూనెలతోపాటు ఇతర సరుకులను పంపిణీ చేసినట్లు తెలిపారు. లయన్ సల్వా సాయిరాం, శ్రీనివాస్‌రెడ్డి, తపన్ గోష్, వినోద్‌కుమార్, అవంతిరెడ్డి, పురుషోత్తం, బల్జిత్ కౌర్, లతా బండారి, జెడ్సీ మనోజ్, శ్రీధర్, శంకర్, భూషణ్, రామిరెడ్డి, ప్రవీణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.